TGTEL/26/A5513

వార్తదీపిక

తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ జిల్లా

స్టాఫ్ రిపోర్టర్లు

మరియు

నియోజకవర్గము

మరియు మండల

రిపోర్టర్లు కావలెను

91 96664 66984

ప్రచురణ : హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక: 88 | 08 గురువారం అక్టోబర్ 2026 | వెల: 02

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక..

రెండు డీఏలు విడుదల...



- ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం
- మొత్తం 6.37 శాతం పెరగనున్న కరువు భత్యం
- అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం


దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. అంటే నవంబరు 1వ తేదీన ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ కానుంది.2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. కేవలం బకాయిల చెల్లింపు కోసమే దాదాపు రూ. 6,174 కోట్లు అవసరమవుతాయి. తాజా పెంపుతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే వెల్లడించారు.

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్.. రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి
- జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణల వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు.

...మిగతా 2 లో...



ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ..

భారతీయులకు సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

- 'మనం సాధించగలం' అంటూ మోదీ నినాదం
- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీ
- 2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన



ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" (ఔవ ఔఅశ్రీశ్రీ ణశీ ఞ) అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిం చారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు.సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు. ...మిగతా 2 లో...

విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ...

- భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు

- ప్రధాని మోదీపై భూటాన్ ప్రధాని పీఎం టోభ్గే ప్రశంసల వర్షం
- 2019లోనే మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్న టోభ్గే
- 'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని వ్యాఖ్య
- ప్రజా జీవితంలో మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యాఖ్యలు

భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోభ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా కొనసాగుతూ ప్రజా సేవ చేస్తున్న తీరును కొనియాడారు.మోదీ నాయకత్వంలో పొరుగు దేశాలతో సంబంధాలకు భారత్ ప్రాధాన్యం ఇస్తోందని టోభ్గే పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను ప్రపంచ వేదికపై బలంగా వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో శాశ్వత సభ్యుడిగా చేర్చడంలోనూ ఆయన కృషిని ప్రశంసించారు.మోదీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న టోభ్గే.. ఆయనను చాలాకాలంగా అన్నయ్యగా భావిస్తున్నానని తెలిపారు. తర్వాత ఆయనను మార్గదర్శకుడిగా కూడా చూసినట్లు చెప్పారు. 2019లో మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2024లో ఢిల్లీలో మోదీని కలిసినప్పుడు తాను గతంలో చెప్పిన మాటల గురించి ఆలోచించానని, తాను తప్పుగా చెప్పలేదని తేల్చుకున్నానన్నారు.విష్ణువు చివరి అవతారమైన కల్కిగా మోదీ కనిపిస్తున్నారని టోభ్గే అన్నారు. అశాంతిని తొలగించి ధర్మాన్ని పునరుద్ధరించి కొత్త మార్పుకు నాంది పలికే అవతారమే కల్కి అని పేర్కొన్నారు. ...మిగతా 2 లో...



నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..

వాటిని మెడల్స్ గా భావిస్తా

- తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ
- తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి
- 'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం
- ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం



నిన్న ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేని పునరుద్ఘాటించారు. ...మిగతా 2 లో...

కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

- తమిళనాడు సీఎం విజయ్‌తో ఏపీసీసీ చీఫ్ షర్మిల భేటీ
- భర్త అనిల్ కుమార్‌తో కలిసి సీఎంను కలిసిన షర్మిల
- కుమార్తె అంజలి రెడ్డి వివాహానికి విజయ్‌ను ఆహ్వానించిన దంపతులు
- వివాహ పత్రిక అందించి వేడుకకు రావాల్సిందిగా విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షు రాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వా నించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. ...మిగతా 2 లో...



యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై అక్టోబర్ 15 నుంచి ఛార్జీలు
- ఈ ఛార్జీల వల్ల లావాదేవీల పరిమాణం తగ్గదని ఆర్బీఐ గవర్నర్ స్పష్టత
- ఈ రుసుముల వల్ల కష్టమర్లపై ఎలాంటి భారం ఉండదని కేంద్రం వెల్లడి
- వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ బదిలీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు

యూపీఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం యూజర్ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.బుధవారం ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ...మిగతా 2 లో...



TGTEL/26/A5513
వార్తదీపిక

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు. అవి: 1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం. 2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం. 3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం. 4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం. 5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం. ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు. సంక్షోభాలను ఎదుర్కొని నిలిచాం గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్ధత (పాలసీ పారాలిసిస్) గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ-2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు. సవాళ్ల నడుమ స్ఫూర్తి నింపే ప్రయత్నం ప్రతిపక్షాల నుంచి విమర్శలు, నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో, మద్దతుదారుల్లో మోదీ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపణలు, యూజీసీ మార్గదర్శకాలపై వ్యతిరేకత వంటి సవాళ్లను ప్రభుత్వం ఎదుర్కొంటోన్న నేపథ్యంలో, ప్రధాని ప్రసంగం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

'కల్కి'గా మోదీ...

మొదటిపేజీ తరువాయి

'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని టోబ్గే వ్యాఖ్యానించారు. 2014లో ప్రధాని అయిన కొద్ది వారాల్లోనే మోదీ తన తొలి విదేశీ పర్యటనకు భూటాన్‌ను ఎంచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ పర్యటనలో భారత్-భూటాన్ సంబంధాలను 'బీ4బీ'గా మోదీ అభివర్ణించారని తెలిపారు. అంటే 'భూటాన్ కోసం భారత్.. భారత్ కోసం భూటాన్' అని వివరించారు.భూటాన్ అభివృద్ధి ప్రణాళికలకు భారత్ అందిస్తున్న సహకారాన్ని టోబ్గే ప్రశంసించారు. 13వ పంచవర్ష ప్రణాళిక కోసం భారత్ అందించే సాయాన్ని మోదీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పెంచిందని చెప్పారు.విద్య, వైద్యం, మౌలిక వసతులు, జల విద్యుత్, సాంకేతికత, వ్యవసాయం, వ్యాపార రంగాల్లో ఇరు దేశాల సహకారం విస్తరించిందన్నారు. భూటాన్ రాజు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గెలెఫు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ ప్రాజెక్టుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తోందని తెలిపారు. రైలు మార్గాలు, సరిహద్దు మౌలిక వసతులు, విమాన, డిజిటల్ కనెక్టివిటీ అభివృద్ధి దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం..

బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

మొదటిపేజీ తరువాయి

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు.ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకు అవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు చెప్పే మాటలు నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు, ఇప్పటి భారత్‌ను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు.ఎన్నికల సంఘాన్ని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. వందల మందితో వెళ్లి దాడి చేస్తే పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు.తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపై కూడా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని అన్నారు.

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్.. రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

మొదటిపేజీ తరువాయి

బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు.కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

ప్రేమానంద్ మహరాజ్ ఆశ్రమానికి డబ్బుల కోసం వెళ్లారా?.. కోహ్లీ ప్రతినిధి ఏమన్నారంటే..!

ఆశ్రమ సందర్శనకు కోహ్లీకి రూ.5 కోట్లు ఇచ్చారన్న ఆరోపణలు ఈ వార్తలను పూర్తిగా ఖండించిన విరాట్ కోహ్లీ ప్రతినిధి ఇవి నిరాధారమైన, వాస్తవ విరుద్ధమైన ఆరోపణలని వెల్లడి మహరాజ్‌పై భక్తి, విశ్వాసంతోనే కోహ్లీ ఆశ్రమానికి వెళతారని స్పష్టీకరణ యూపీ సీఎంకు రాసిన లేఖలో ఈ ఆరోపణలు చేసినట్లు సమాచారం భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మ తరచూ వృందావన్‌లోని ప్రేమానంద్ మహరాజ్ ఆశ్రమాన్ని సందర్శించడం తెలిసిందే. అయితే, ఈ సందర్శన వెనుక ఆర్థిక లావాదేవీలు ఉన్నాయంటూ వచ్చిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. ఆశ్రమానికి వెళ్లేందుకు విరాట్ కోహ్లీకి ఒక ప్రైవేట్ సంస్థ రూ.5 కోట్లు చెల్లించిందన్న వాదనలను ఆయన ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని స్పష్టం చేశారు. శ్రీకృష్ణ జన్మభూమి సంఘర్ష్ న్యాస్ అధ్యక్షుడు దినేశ్ శర్మ (ఫలహరి మహరాజ్) ఈ ఆరోపణలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. రాజస్థాన్‌కు చెందిన ఒక ప్రైవేట్ సంస్థ, విరాట్ కోహ్లీని ఆశ్రమానికి తీసుకువచ్చేందుకు రూ.5 కోట్లు ఖర్చు చేసిందని ఆరోపిస్తూ ఆయన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఒక లేఖ రాసినట్లు సమాచారం. ఈ వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో వివాదం మొదలైంది. ఈ ఆరోపణలపై విరాట్ కోహ్లీ టీమ్ అధికారికంగా స్పందించింది. కోహ్లీ ఆశ్రమ సందర్శన వెనుక ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు లేవని తేల్చిచెప్పింది. "ప్రేమానంద్ మహరాజ్ పట్ల విరాట్ కోహ్లీకి ఉన్న ప్రగాఢమైన భక్తి, విశ్వాసం కారణంగానే ఆయన ఆశ్రమానికి వెళ్తున్నారు. ఈ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదు. ఇలాంటి సున్నితమైన విషయాల్లో వార్తలు ప్రచురించే ముందు మీడియా సంస్థలు వాస్తవాలను నిర్ధారించుకోవాలి" అని కోహ్లీ ప్రతినిధి ఒక ప్రకటనలో కోరారు. విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు తొలిసారిగా జనవరి 2023లో ప్రేమానంద్ మహరాజ్ ఆశ్రమాన్ని సందర్శించారు. అప్పటి నుంచి వారికి వీలు చిక్కినప్పుడల్లా ఆశ్రమానికి వెళ్లి మహరాజ్ ఆశీస్సులు తీసుకుంటున్నారు.

కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

మొదటిపేజీ తరువాయి

అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు.తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఎల్ఐసి ఏజెంట్ సంఘం నూతన అధ్యక్ష కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నిక

(వార్త దీపిక)

ఎల్ఐసి ఏజెంట్ యూనియన్ ఎన్నికలను బుధవారం రోజున మెట్టుపల్లి లో నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికల్లో నూతన ఎల్ఐసి యూనియన్ అధ్యక్షులుగా నాగభూషణం, సెక్రెటరీగా మర్రి భాస్కర్, కోశాధికారిగా వాసాల వినయ్ ని ఎన్నుకోవడం జరిగింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా లియాఫీ 1964 సెంట్రల్ సెక్రెటరీ ఎస్ బి శ్రీనివాసచారి, కరీంనగర్ డివిజన్ అధ్యక్షులు బోయిన్పల్లి ప్రభాకర్ రావు , ఆల్ ఇండియా లీగల్ కమిటీ చైర్మన్ గట్టు రాజయ్య పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎల్ఐసి సమస్యలు ఏమైనా ఉన్నా వెంటనే పరిష్కరించుకోవాలని, ప్రజల్లో ఎల్ఐసి చేస్తున్న సేవలు ప్రచారం చేయాలని, ఎల్ఐసి ద్వారా భారత దేశ ప్రజలకు ఏ విధంగా లబ్ధి చేకూరుస్తుంది, ఏ విధంగా సహాయ సహకారాలు అందిస్తుందని ఎల్ఐసి సంస్థ విజయాలను తెలుపాలని అన్నారు. నూతనంగా ఎన్నికైన వీరిని శాలువాతో సన్మానం చేసి అభినందించారు. నియామక పత్రం అందించారు. అనంతరం వీరి ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన ఎల్ఐసి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రెజరర్ శ్రీరామ్ , జోనల్ రెసిడెన్సి సెక్రెటరీ వెంకట్ రెడ్డి, డివిజన్ సెక్రెటరీ గంధం వెంకటేశ్వర్లు, డివిజన్ ట్రెజరర్ ఉత్కం వెంకట్ గౌడ్, మిట్టపల్లి మల్లారెడ్డి,గురుడు రాజగంగారం గారల అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సుమారు 400 మంది ఎల్ఐసి ఏజెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

ఈ కొత్త ఛార్జీల వల్ల యూపీఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, "ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యూపీఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు.గత ఆరేళ్లుగా నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ. 2,000కు పైబడిన లావాదేవీలపై ఎండీఆర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకే వర్తిస్తాయని, కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలోనే స్పష్టం చేశారు. ఈ రుసుము ప్రభుత్వానికి కాకుండా, పేమెంట్ సేవలు అందించే సంస్థలకు చేరుతుందని ఆమె తెలిపారు.ఈ ఛార్జీలకు సంబంధించి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తుల వంటి రంగాల్లో రూ. 2,000 దాటిన చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ. 5 ఫ్లాట్ ఫీజు ఉంటుంది. రూ. 75,000 అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలపై ఎండీఆర్ గరిష్ఠంగా రూ. 300గా నిర్ణయించారు. అయితే, వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎంత మొత్తమైనప్పటికీ ఎలాంటి ఛార్జీలు ఉండవని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ సేవలు యథాతథంగా ఉచితంగానే కొనసాగుతాయి.

మూసీ భూసేకరణపై రైతుల పట్టు 70:30 వాటా ఇస్తేనే భూములు

(వార్త దీపిక)

మూసీ రివర్ ల్యాండ్ పూలింగ్‌లో రైతుల వాటా పెంచితేనే భూములు ఇస్తామని రైతులు తేల్చిచెప్పారు. ప్రతాపసింగారం, కొర్రెముల, ఎదులాబాద్‌లో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో రైతులు తమ డిమాండ్లను వెల్లడించారు. ఎకరా పట్టా భూమికి ఎఫ్‌టీఎల్, బఫర్ ఏరియా అనే తేడా లేకుండా 70:30 నిష్పత్తిలో (రైతులు:ప్రభుత్వం) అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయించాలని కోరారు. లేఅవుట్ పూర్తయ్యే వరకు నెలవారీ పరిహారం చెల్లించాలని, లేఅవుట్ పూర్తికి స్పష్టమైన గడువు ప్రకటించాలని డిమాండ్ చేశారు.హామీలతో సరిపెట్టకుండా తమ డిమాండ్లపై లిఖితపూర్వకంగా స్పష్టత ఇవ్వాలని, అప్పటి వరకు భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. పట్టా భూములన్నింటికీ సమాన పరిహారం, ప్రయోజనాలు కల్పించి, ఎలాంటి వివక్షకు తావులేకుండా న్యాయం జరిగేలా చూస్తానని మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రైతుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఘట్‌కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.





శిశువు వైద్యం కోసం మంత్రిని ఆశ్రయించిన దంపతులు.. అండగా నిలిచిన కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి

చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చి వారికి అండగా నిలిచారు.వివరాల్లోకి వెళితే, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫణిగిరి గ్రామానికి చెందిన జంపాల మహేశ్ కుమార్, రజిత దంపతులు పుట్టుకతోనే మూగ, బధిరులు. ఇటీవల వారికి జన్మించిన శిశువుకు కూడా ఇదే సమస్య ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్న వయసులోనే సర్జరీ చేస్తే బిడ్డకు మాట, వినికిడి వచ్చే అవకాశం ఉందని, అయితే అందుకు లక్షల్లో ఖర్చవుతుందని తెలిపారు.ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆ దంపతులు హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డిని ఈరోజు కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వారి పరిస్థితికి చలించిపోయిన మంత్రి, చిన్నారిని చేతుల్లోకి తీసుకుని వారికి ధైర్యం చెప్పారు. తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం వెంటనే రూ. 2 లక్షల రూపాయల సాయాన్ని అందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "మీ చిన్నారి గురించి ఆందోళన వద్దు. ఆ బిడ్డకు మాటలు వచ్చేలా చేసే బాధ్యత నాది. మీకు ఎలాంటి సహాయం కావాలన్నా నేనున్నాను" అని వారికి భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, మెరుగైన శస్త్రచికిత్స కోసం ప్రత్యేక వైద్యులతో తానే స్వయంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో ఆ దంపతులు భావోద్వేగానికి గురై కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న మంత్రి కోమటిరెడ్డిని స్థానికులు ప్రశంసించారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ

జహీరాబాద్, అక్టోబర్ 7, వార్త దీపిక న్యూస్ :

వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, కరెంట్ లేక రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో లో – వోల్టేజ్ సమస్య తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని అలాగే త్రీ ఫేజ్ కరెంట్ కనీసం ఆరు గంటలు కూడ రావడం లేదని ఆయన పేర్కొన్నారు దీంతో వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అదేవిధంగా ఈ సీజన్లో సరైన సమయంలో వర్షాలు పడకపోవడంతో పంటల సాగు, ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతోందని తట్టు నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే రైతులు ఆందోళనలో ఉన్నారని, మరోవైపు విద్యుత్ సమస్యలు వారి ఇబ్బందులను మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని లో –వోల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు అవసరమైన నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలు సరిగా పండక నష్టపోయే రైతులను ప్రభుత్వం గుర్తించి, తగిన విధంగా ఆదుకోవాలని కోరారు.రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు, వర్షాభావ పరిస్థితులకు సంబంధించిన సహాయక చర్యలను వేగంగా చేపట్టి, రైతులకు భరోసా కల్పించాలని తట్టు నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ మంత్రి హరీష్ రావు భరోసా

జహీరాబాద్, అక్టోబర్ 7, వార్త దీపిక న్యూస్ :

నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ మంత్రి హరీష్ రావు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, మల్గి మాజీ సర్పంచ్ మారుతి, మల్గి గ్రామ సభలో యువకులపై జరిగిన దౌర్జన్యం పై మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు. కార్యకర్తలకు ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యలను వివరించారు. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా వారికి పార్టీ అండగా ఉంటుందని, న్యాయ పరంగా అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హరీష్ రావు హామీ ఇచ్చారు.



డ్రగ్స్, సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన

ఎస్ ఐ. మల్లేశం

జహీరాబాద్, అక్టోబర్ 7, వార్త దీపిక న్యూస్ :

మొగుడంపల్లి మండల పరిధిలోని చిరాక్ పల్లి గ్రామం జెడ్.పి.హెచ్.ఎస్. చిరాక్‌పల్లి పాఠశాలలో యాంటీ డ్రగ్స్ ఁ సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం ఏఎస్ఐ మల్లేశం పాల్గొన్నారు. చిరాక్‌పల్లి: విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు జెడ్.పి.హెచ్.ఎస్. చిరాక్‌పల్లి పాఠశాలలో యాంటీ డ్రగ్స్ ఁ సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చిరాక్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ మల్లేశం వారి పోలీస్ స్టేషన్ యొక్క సిబ్బంది హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, వాటికి దూరంగా ఉండాల్సిన అవసరం గురించి వివరించారు. ముఖ్యంగా డ్రగ్స్‌కు అలవాటు పడటం వల్ల విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యం, కుటుంబ జీవితం తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు.అదేవిధంగా ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, అనుమానాస్పద లింకులు మరియు తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు.విద్యార్థులు ఎటువంటి అనుమానాస్పద సైబర్ కార్యకలాపాలు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన విషయాలు గమనించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఏఎస్ఐ మల్లేశం సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం, బాధ్యత యుతమైన పౌరులుగా



ఎదగడం వంటి అంశాలపై అవగాహన పెంపొందించారు. చిరాక్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడాకులపల్లిలో శని అమావాస్య మహాయజ్ఞం

1108 కలశాలతో తిలతైలాభిషేకం

భక్తులకు ప్రత్యేక అభిషేక సౌకర్యం

ఝరాసంగం, అక్టోబర్ 7, వార్త దీపిక న్యూస్ :

జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం మండలం ఏడాకులపల్లి గ్రామంలో ఉన్న సప్తపురి శనిఘాట్‌లో శని అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 10న (శనివారం) శని మహాయజ్ఞాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 1108 కలశాలతో తిలతైలాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిలతైలాభిషేకానికి సంబంధించిన పూజా సామగ్రిని శనిఘాట్ నిర్వాహకులే అందజేస్తారని, బయటి నుంచి తీసుకొచ్చే పూజా సామగ్రికి అనుమతి ఉండదని పేర్కొన్నారు. భక్తులు తమ గోత్రనామాలను శనిఘాట్ వద్ద లేదా శనిఘాట్ పూజారిని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. జన్మ, అర్ధాష్టమ, అష్టమ, ద్వాదశ స్థానాల్లో శనిగ్రహ సంచారం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు సహస్ర కలశ తైలాభిషేకంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. శని మహాయజ్ఞంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు తెలిపారు. భక్తులు స్వయంగా శనిదేవునికి అభిషేకం చేసుకునే ప్రత్యేక సౌకర్యం కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. కోహీర్ చౌరస్తా నుంచి ప్రత్యేక వాహనాలు భక్తుల సౌకర్యార్థం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సప్తపురి శనిఘాట్ ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై శనిదేవుని కృపకు పాత్రులు కావాలని కోరారు.



మంచి నీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి

వర్షాలు కురిసే వరకు మంజీరా, సింగూరు నీళ్లు తాగుకు ఉపయోగించుకోవాలి

ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు సూచన

తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి అక్టోబర్ 7, వార్త దీపిక న్యూస్ :

రానున్న ఏడు నెలలు తాగునీటి విషయంలో పరిస్థితి తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాలం చెప్పినట్లు, కాలానికి అనుగుణంగా నడుచుకోవాలని, సరైన వర్షాలు లేవు. మనం సింగూరు డ్యామ్‌పై ఆధారపడి ఉన్నాం. సింగూరుకు వచ్చే నీరు కర్ణాటక, మహారాష్ట్రలో కురిసే వర్షాలపై ఆధారపడి ఉంటుంది. ఎవరినో నిందిస్తే సమస్య పరిష్కారం కాదు. నీళ్లు ఉంటేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. నీటి లభ్యతను బట్టే వినియోగం ఉండాలని పేర్కొన్నారు.నీటి కొరతపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలతో పాటు నాలుగు మండలాల గ్రామాల్లో నీటి లభ్యత, పొదుపుపై చాటింపు వేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పాంప్లెట్లు, మైకుల ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని చెప్పారు. మంజీరా బ్యారేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నీటి డ్రాయింగ్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించేలా విజ్ఞప్తి చేస్తే, మున్సిపాలిటీకి మరికొంత కాలం తాగునీటి సరఫరా కొనసాగించే అవకాశం ఉంటుందని సమావేశంలో చర్చించారు. అవసరమైతే మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కంది పరిసర చెరువుల్లో నీరు అందుబాటులో ఉందని, గ్రామంలోని 28 బోర్లకు అవసరమైన మోటార్లు ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. మిషన్ భగీరథ సరఫరాలో ప్రెషర్ పెంచితే ఇస్మాయిల్‌ఖాన్‌పేట, హనుమాన్‌నగర్, ఫసల్‌వాడి గ్రామాలకు నీటి సరఫరా మెరుగుపడుతుందని సమావేశంలో ప్రస్తావించారు. కంది మండలం తోపుగొండలో మిషన్ భగీరథ నీరు నెలకు నాలుగుసార్లు మాత్రమే వస్తోందని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో పశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్‌లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి ఇటీవల నీటిని విడుదల చేసిన అంశంపైనా జగ్గారెడ్డి స్పందించారు. ఢిల్లీ నుంచి వచ్చిన డ్యామ్ సేఫ్టీ అధికారులు సింగూరు ప్రాజెక్టును పరిశీలించగా, కట్టలో కొంత భాగం దెబ్బతిన్నట్లు గుర్తించి మరమ్మతుల కోసం కొంత నీటిని విడుదల





చేయాలని సూచించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షణలో నిపుణుల కమిటీ సూచనల మేరకే నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో డ్యామ్‌ను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే నీటిని విడుదల చేశారు. ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సహజమే కానీ, సాంకేతిక నిపుణుల సూచనల మేరకు తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయం చేయడంలో అర్థం లేదని జగ్గారెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. నియోజకవర్గంలో విద్యుత్ బ్రేక్‌డౌన్లు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారంపై వచ్చే మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.

మహిపాల్‌రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, వెంటనే అరెస్ట్ చేయాలి..!

సంగారెడ్డి, అక్టోబర్ 7, వార్త దీపిక న్యూస్ :

మహిపాల్ రెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, రిమాండ్ చేయాలని బుధవారం కంది మండల పరిధిలోని ఎర్దనూర్ గ్రామంలో సేవాలాల్ మహారాజ్ మాలధారణలో ఉన్న నేనావత్ గోపాల్‌పై జరిగిన ఘటనకు లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు నిరసన తెలిపారు. సంబంధించి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మహిపాల్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు కావడాన్ని లంబాడా హక్కుల పోరాట సమితి స్వాగతించింది. బాధితులకు న్యాయం చేయాలంటూ ప్రజా, గిరిజన సంఘాలు చేపట్టిన నిరసనలు, దీక్షలు, నిరంతర ఒత్తిడి ఫలితంగానే కేసు నమోదైందని సంఘం నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ నాయక్, జిల్లా కార్యదర్శి మహేష్ రాథోడ్ మాట్లాడుతూ కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎర్దనూర్ పరిధిలోని క్రషర్‌ను తొలగించాలని, గిరిజనుల భద్రతకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాతోల్ మజ్జి సర్పంచ్ శంకర్ నాయక్, బ్యాతోల్ మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్ నాయక్, దీక్షా బాపులు, నాయక్, జగదీష్, శ్రీనివాస్, ప్రకాష్, భీమ్రావు'సేవాలాల్ మహారాజ్ పూజారిల్లు గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



TGTEL/26/A5513
వార్త దీపిక

రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా సంఘీభావ దీక్ష

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

టిజిఐఐసి చైర్మన్ నిర్మల, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి అక్టోబర్ 7, వార్త బిపిక న్యూస్ :

దేశ ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మల జగ్గారెడ్డి సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ బలపడిన రాష్ట్రాల్లో ఎన్నికల వ్యవస్థను తమకు అనుకూలంగా మార్చుకుని అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ సహకారంతోనే బీజేపీ మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని, ఈ అంశంపై రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారని పేర్కొన్నారు. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ రాజకీయ పోరాటం కాదని దేశ ప్రజల ఓటు హక్కును కాపాడే రాజకీయ యుద్ధమని, దేశ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారన్నారు.సర్ ప్రక్రియలోనూ ఎన్నికల కమిషన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, ఓట్ల జాబిత విషయంలో తలెత్తుతున్న వివాదాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. దేశ ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోరాటానికి మద్దతు తెలుపుతూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేయాలన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నేతలను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు. దేశంలో



స్వతంత్ర ఎన్నికల వ్యవస్థకు పునాదులు పడిన కాలం నుంచి నెహ్రూ గాంధీ కుటుంబం ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొన్నారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు కోల్పోయారని, సోనియా గాంధీ సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో సేవలందించారని గుర్తుచేశారు. త్యాగాల చరిత్ర ఉన్న కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ ఇప్పుడు దేశ ప్రజల ఓటు హక్కు కోసం పోరాడుతున్నారని, అందుకు ప్రజలంతా స్వచ్ఛందంగా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. దీక్షలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

జంతువుల పట్ల దయ చూపుదాం...

జీవకారుణ్యాన్ని పెంపొందిద్దాం...!

(వార్త దీపిక)

ముళ్లు గుచ్చుకుంటేనే బాధపడే మనిషి.. మరో జీవి గొంతు కోసే బాధను ఒక్కసారి అయినా మనసుతో ఆలోచించాలి. ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉంది. మనిషికి ఉన్నట్లే జంతువులకూ ఆకలి, బాధ, భయం, జీవించాలనే తపన ఉంటాయి.అహింస, దయ, కరుణ, జీవకారుణ్యం వంటి విలువలను భారతీయ తత్వచింతన ఎంతోకాలంగా ప్రాధాన్యంగా చెబుతోంది. “అహింసో పరమో ధర్మః” అనే భావన మనిషి తనకు సాధ్యమైనంత వరకు ఇతర జీవులకు హాని చేయకుండా జీవించాలని గుర్తుచేస్తుంది.శాకాహారం అనేది కేవలం ఆహారపు అలవాటు మాత్రమే కాదు.. అనేకమంది దృష్టిలో అది జీవుల పట్ల కరుణ, ప్రకృతి పట్ల బాధ్యత, అహింస పట్ల నిబద్ధతకు సంబంధించిన జీవన విధానం.జంతువులను చూస్తే వాటిలో కేవలం “ఆహారం” కాకుండా ఒక జీవిని, ఒక ప్రాణిని, ఒక జీవనాన్ని చూడగలిగినప్పుడే మనలో నిజమైన కరుణ పెరుగుతుంది. జీవిని హింసించకుండా ఉండటం..బలహీనమైన ప్రాణికి అండగా నిలవడం..జంతువుల పట్ల దయ చూపడం.. ప్రకృతిని కాపాడటం..ఇవన్నీ మానవత్వంలో భాగమే.మాంసాహారం తీసుకునే ప్రతి వ్యక్తిని తప్పుబట్టడం ఈ సందేశం ఉద్దేశం కాదు. అయితే మన ఆహారపు అలవాట్ల గురించి ఒక్కసారి మనసుతో ఆలోచించడం మాత్రం అవసరం.“నా జీవనం కోసం మరో జీవి ప్రాణం పోవాల్సిందేనా?”అనే ప్రశ్న మనలో పుడితే.. అదే జీవకారుణ్యానికి



తొలి అడుగు. దయగల హృదయంలోనే మానవత్వం ఉంటుంది.కరుణ ఉన్న చోటే అహింస ఉంటుంది.అహింస ఉన్న చోటే శాంతి ఉంటుంది. జంతువుల జీవించే హక్కును గౌరవిద్దాం..జీవకారుణ్యాన్ని ఆచరిద్దాం..ప్రకృతిని ప్రేమిద్దాం..అహింసను జీవితంలో భాగం చేసుకుందాం.

అహింసో పరమో ధర్మః సర్వేజనాః సుఖినో భవంతు.

ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వాయుసేన భారత వైమానిక దళం

-నేడు భారత వైమానిక దళ వ్యవస్థాపక దినోత్సవం

(వార్త దీపిక)



భారత వైమానిక దళం (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) ఆవిర్భావమై నేటికి 94సంవత్సరాలు. 1932 అక్టోబరు ఎనిమిదో తేదీన స్థాపితమైన ఐఎఎఫ్.. మొత్తం ఐదు ఆపరేషనల్ కమాండింగ్ కేంద్రాలను కలిగిన ఐఎఎఫ్‌కు 1,130 కంబోట్ 1,700 నాన్ కంబోట్ ఎయిర్‌కాఫ్ట్‌లు ఉన్నాయి. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వాయుసేనగా భారత వైమానిక దళం పేరుగడించింది. తనకు అవసరమైన సిబ్బందికి అధునాతన శిక్షణ ఇచ్చుకోవడంలోను, అధునాతన యంత్రసామాగ్రిని సమకూర్చుకోవడంలోను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ముందంజలో ఉండటమే కాకుండా.. ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. 1932 అక్టోబర్ 8న ఏర్పడిన భారత వైమానిక. దళం బ్రిటీష్ తరపున రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నది. దానికి గుర్తుగా 1945లో రాయల్ భారత వైమానిక దళంగా మార్చబడింది.1950లో గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన తరువాత భారత వైమానిక దళంగా రూపాంతరం చెందింది. 1933 ఏప్రిల్ 1న భారత వైమానిక దళానికి తొలి ఎయిర్‌క్రాఫ్ట్ వచ్చి చేరింది. ఆరంభంలో కేవలం ఐదు మంది పైలట్స్, ఒక ఆర్ఏఎఫ్‌ను కలిగివున్నది. ఇండియన్ ఎయిర్ ఫోర్సుకు తొలి ఐదుగురు పైలట్స్‌గా విధులు నిర్వహించిన ఘనత హరీష్ చంద్ర సిర్కార్, సుబ్రొతో ముఖర్జీ, భూపేంద్ర సింగ్, అజాద్ భక్షా అవాన్, అమర్జీత్ సింగ్‌లు వైమానిక చరిత్ర పుటల్లో నిలిచిపోయారు. ఆ తర్వాత సుబ్రతో ముఖర్జీ తొలి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. తర్వాత రెండో ప్రపంచ యుద్ధానికి ముందు.. అంచలంచెలుగా మరింత మంది సిబ్బందిని ఐఎఎఫ్ నియమించుకుంది. వీరిలో అస్పీ ఇంజనీర్, కేకె.ముజుందర్, నరేంద్ర, దల్జీత్ సింగ్, హెన్రీ రంగనాథన్, ఆర్‌హెచ్‌డి సింగ్, బాబా మెహర్ సింగ్, ఎస్ఎన్.గోయల్, ప్రిత్‌పాల్ సింగ్, అర్జన్ సింగ్‌లు అగ్రగణ్యులు. వీరు వాయుసేనకు అందించిన సేవలు ప్రశంసనీయం. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో భారత వాయుసేన క్రీయాశీలక పాత్రను పోషించింది. తొలి వైమానిక దళ దాడి అర్కన్ ప్రాంతంలోని జపనీస్ సైనిక స్థావరంపై జరిపింది. ఈ యుద్ధం తర్వాత ఐఎఎఫ్‌ను అంచలంచెలుగా వృద్ధి చెందింది. యూఎస్‌కు చెందిన వుల్టీ వెంగీయన్స్, బ్రిటీష్ హాకర్ హరీకేన్, వెస్ట్‌లాండ్ లైసండర్ వంటి అధునాతన ఎయిర్ క్రాఫ్ట్‌లు ఐఎఎఫ్‌లో వచ్చి చేరాయి. అంతేకాకుండా.. భరతగడ్డపై పొరుగు దేశాలు దాడికి తెగబడినపుడల్లా భారత వాయుసేన కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు1.70 లక్షల మంది సిబ్బందితో, 1300 విమానాలతో భారత వైమానిక దళం ప్రపంచంలోనే నాలుగవ పెద్ద వైమానిక దళంగా ప్రసిద్ధి పొందింది.ముఖ్యంగా.. 1960లో ఏర్పడిన కాంగో సంక్షోభ సమయంలోను, 1962లో జరిగి ఇండో-చైనా పోరు సమయంలోను, కాశ్మీర్ కోసం 1965లో పాకిస్తాన్‌తో జరిగి యుద్ధ సమయంలోను, 1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలోను, 1984లో జరిగి ఆపరేషన్ మేఘదూత్‌లోను, 1988లో ఆపరేషన్ కాక్టస్‌లోను, 1999లో జరిగిన ఆపరేషన్ సఫేద్ సాగర్ (కార్గిల్ వార్) సమయాల్లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సేవలు ప్రశంసనీయం. గడచిన ఎనిమిది దశాబ్దాల్లో మన వైమానిక దళం సాంకేతికంగా ఎంతోఅభివృద్ధి చెందింది. ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉంది. భారత గగన తలంలోకి ఇతర దేశాల విమానాలు చొచ్చుకుని రాకుండా నిరంతరం నిఘా వేస్తోంది. అదే సందర్భంలో దేశంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను రక్షించడానికి, వారికి సహాయం చేయడానికి వైమానికదళం అందిస్తోన్న సేవలు అమోఘం. 94వ వార్షికోత్సవం సందర్భంగా ఈరోజు ఘజియాబాద్ లోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ హిందాన్ లో జరిగే పెరేడ్ లో వైమానిక దళ ప్రధానాధికారి గౌరవ వందనం స్వీకరిస్తారు.

వికసిత్ భారత్ సంకల్ప సభ సేవాజ్యోతి యాత్ర

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ :07(వార్త దీపిక)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల సుదీర్ఘ నిస్వార్థ ప్రజా సేవా చేస్తున్నారని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు.బుధవారం నాడు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల సుదీర్ఘ వికసిత్ భారత్ సంకల్ప సభ సేవా జ్యోతి యాత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రావ్ దేశ్ పాండే రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు వివిధ మోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు సంగారెడ్డి పట్టణ ప్రజలు పాల్గొన్నారు





విలోచవరం ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గా రవికుమార్

(వార్త దీపిక)

మంథని మండలం విలోచవరం గ్రామంలోని ప్రముఖ పురాతన దేవాలయాలైన శ్రీ పర్వతాల మల్లికార్జున స్వామి, శ్రీ రామాలయం, శ్రీ సాయిబాబా ఉమ్మడి ఆలయాల అభివృద్ధి కోసం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం దేవాలయ ఆవరణలో గ్రామ పెద్దలు, రైతులు, భక్తుల సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. నూతన కమిటీ చైర్మన్ గా కావేటి రవికుమార్, వైస్ చైర్మన్ గా జూనగిరి సుమన్,కార్యవర్గ సభ్యులుగా బీముని రాజమల్లు గౌడ్, పుట్ట సంతోష్, బోగిరి కార్తీక్, కొరవేణి మధుకర్, ఎరుకల సుధాకర్, కొండ దేవేందర్, తోటపెల్లి ప్రశాంత్, గుర్రాల సంతోష్, కొటం రాజేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ, పురాతన ఆలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.



ముగిసిన సింగరేణి కంపెనీ స్థాయి హాకీ పోటీలు, విజేతగా నిలిచిన మందమర్రి-బెల్లంపల్లి జట్టు, రన్నరప్ గా శ్రీరాంపూర్ జట్టు

(వార్త దీపిక)

సింగరేణి ఆర్‌జీ-2 వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యైటింక్లైన్ కాలనీలోని ఏపీజే అబ్దుల్ కలాం స్టేడియంలో నిర్వహించిన సింగరేణి కంపెనీ స్థాయి హాకీ పోటీలు బుధవారం ముగిశాయి. ఫైనల్‌లో శ్రీరాంపూర్‌పై మందమర్రి-బెల్లంపల్లి జట్టు 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించి విజేతగా నిలవగా, శ్రీరాంపూర్ రన్నరప్‌గా నిలిచింది.ముగింపు కార్యక్రమానికి ఆర్‌జీ-2 ఏరియా జీఎం తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులను అభినందించిన ఆయన, కంపెనీ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి కోల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికైన వారు, సింగరేణి కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్‌లో ఎస్ఈసీఎల్ బిలాస్‌పూర్‌లో జరిగే కోల్ ఇండియా స్థాయి పోటీల్లో సింగరేణి తరఫున పాల్గొననున్నారు. అనంతరం క్రీడాకారులు జీఎంను సన్మానించారు.కార్యక్రమంలో అధికారులు వేణుగోపాల్, సత్యనారాయణ, చంద్రశేఖర్, సునీల్, శ్రావణ్ కుమార్, యూనియన్ నాయకులు శాంసన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు నరేందర్ రెడ్డి, అశోక్, పర్స శ్రీనివాస్, హాకీ సమన్వయకర్త ఎం.ఏ. అక్రమ్‌తో పాటు సింగరేణి 11 ఏరియాల క్రీడాకారులు పాల్గొన్నారు.

